న్యూయార్క్ అటార్నీ జనరల్ రేసులో
తెలంగాణ మహిళా సరితా కోమటిరెడ్డి

● సరితకు ట్రంప్ మద్దతు.. ● న్యూయార్క్ అటార్నీ జనరల్ రేసులో కీలక పరిణామం



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: అమెరికా రాజకీయాల్లో భారత సంతతికి చెందిన వారు కీలక పదవులు అధిరోహిస్తున్నారు. ఈ క్రమంలో న్యూ యార్క్ అటార్నీ జనరల్ పదవి కోసం తెలుగు సంతతి మహిళ సరితా కోమటిరెడ్డి పోటీ పడుతున్నారు. ఆమెకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు ప్రకటించారు. దాంతో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి లెటిటియా జేమ్స్‌కు గట్టి ప్రత్యర్థిగా మారారు. ఆగస్టు 15న సరితను నామినేట్ చేసిన ట్రంప్ రెండు దఫాలుగా అటార్నీ జనరల్ పదవిలో ఉన్న లెటిటియా జేమ్స్‌పై విమర్శలు గుప్పించారు. తన విధి నిర్వహణలో జేమ్స్ పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ట్రంప్ తనకు మద్దతు ఇవ్వడంపై సరిత కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్ తనను అటార్నీ జనరల్ పదవికి నామినేట్ చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా అని ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

ఎవరీ సరితా కోమటిరెడ్డి!

41 ఏళ్ల సరిత కు న్యాయవృత్తిలో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆమె కుటుంబం దశాబ్దాల క్రితమే తెలంగాణ నుంచి అమెరికాకు వలస వెళ్లింది. సరిత బ్రూక్లిన్‌లో జన్మించారు. తర్వాత ఆమె కుటుంబం మిస్సోరికి వెళ్లిపోయింది. ఆమె హార్వర్డ్ కాలేజ్ అండ్ హార్వర్డ్ లా స్కూల్ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. కొలంబియా లా స్కూల్‌లో లెక్చరర్‌గా పనిచేసిన తర్వాత.. ఫెడరల్ ప్రాసిక్యూషన్ విధుల్లో చేరారు. ప్రస్తుతం హోల్జ్‌మన్ వొగెల్ లా సంస్థతో కలిసి ఆమె పనిచేస్తున్నారు. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమరవాణా, సైబర్ క్రైమ్, మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసుల్ని వాదించిన అనుభవం ఆమెకు ఉంది. ఆమె డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా కూడా పనిచేశారు. ప్రస్తుతం అటార్నీ జనరల్ పదవికోసం పోటీ పడుతోన్న సరితా కోమటిరెడ్డి ప్రజా భద్రత గురించే ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. భారతీయ అమెరికన్ నేపథ్యం గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో అటార్నీ జనరల్ పదవికి రిపబ్లికన్ పార్టీ నుంచి నామినేషన్ పొందిన తెలుగు నేపథ్యం ఉన్న తొలి మహిళ సరితనే అని తెలుస్తోంది. ఈ నవంబర్‌లో ఈ ఎన్నిక జరగనుంది.

రైల్వే మల్టీట్రాకింగ్‌కు రూ.9,450 కోట్లు

● ఏపీ సహా నాలుగు రాష్ట్రాల్లో 410 కి.మీ. మేర కొత్త లైన్లు..

● 60 లక్షల మందికి మెరుగైన రైలు కనెక్టివిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైల్వే రవాణా సామర్థ్యాన్ని భారీగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. మొత్తం రూ.9,450 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుల ద్వారా భారతీయ రైల్వే నెట్‌వర్క్ మరో 410 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. 2030-31 నాటికి ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని ఎనిమిది జిల్లాల పరిధిలో ఈ పనులు చేపట్టనున్నారు. వీటి ద్వారా సుమారు 60 లక్షల జనాభా ఉన్న 6,448 గ్రామాలకు మెరుగైన రైలు అనుసంధానం అందుబాటులోకి రానుంది. మల్టీట్రాకింగ్ పనులతో రైళ్ల రాకపోకలు వేగవంతం కావడంతో పాటు ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. రైల్వే రవాణా సామర్థం, సేవల విశ్వసనీయత మరింత మెరుగుపడనుంది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్-తమిళనాడు మధ్య రైలు రవాణాకు కీలకమైన గుమ్మిడిపూండి-గూడూరు మార్గం సామర్థం పెరగడం ద్వారా ప్రయాణికులు, సరుకు రవాణాకు ప్రయోజనం కలగనుంది. కొత్త రైల్వే మార్గాల ద్వారా బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఇనుము-ఉక్కు, కంటైనర్లు, వాహనాలు, ఆహార ధాన్యాల రవాణాకు మరింత సామర్థం లభించనుంది. ఏటా అదనంగా 76 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసే అవకాశం ఏర్పడనుంది.

పర్యావరణానికీ మేలు

రైల్వే రవాణా విస్తరణతో ఇంధన వినియోగం, రవాణా వ్యయం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం కానుంది. ఏటా సుమారు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు తగ్గి, దాదాపు 65 కోట్ల కిలోల కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని కేంద్రం అంచనా వేసింది. ఇది సుమారు 2.60 కోట్ల మొక్కలు నాటడం ద్వారా కలిగే పర్యావరణ ప్రయోజనంతో సమానమని తెలిపింది. ఈ రైల్వే మార్గాల సామర్థం పెరగడంతో పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యం, వీరరాఘవ పెరుమాళ్ ఆలయం, ఒడిశాలోని పలు పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు అనుసంధానం మరింత మెరుగుపడనుంది.

ప్రాజెక్టులు ఇవే..

ఖరగ్‌పూర్-భద్రక్ (రనిటాల్) నాలుగో లైన్ - 173 కి.మీ.
భద్రక్-హరిదాస్‌పూర్ నాలుగో లైన్ - 75 కి.మీ.
గుమ్మిడిపూండి-గూడూరు మూడో, నాలుగో లైన్లు - 90 కి.మీ.
కటక్-పారాదీప్ (బడబం) మూడో, నాలుగో లైన్లు - 72 కి.మీ.

ఖానాపురం పండ్ల మార్కెట్ యార్డుకు రూ.17.72 కోట్లు

మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో నిధులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఖమ్మం పట్టణ నడిబొడ్డులోని ఖానాపురం హవేలీ పరిధిలో నిర్మాణంలో ఉన్న పండ్ల మార్కెట్ యార్డుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. గతంలో నిర్మాణ పనులు సగంలోనే నిలిచిపోవడంతో పండ్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ రోడ్లపైనే విక్రయాలు సాగిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంత్రి తుమ్మల కృషితో ఖానాపురం పండ్ల మార్కెట్ యార్డు నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.17.72 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయి.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ కొరడా

● జక్కిడి ప్రభాకర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

● ఎమ్మెల్యే మెఘారెడ్డిపై వ్యాఖ్యలపై చిన్నారెడ్డికి నోటీసులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేతలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఎట్టకేలకు కొరడా ఝుళిపించింది. ఇప్పటి వరకు చిన్నా చితక నేతలపై వేటు వేసిన కమిటీ బుధవారం ఒక సీనియర్ నేతను సస్పెండ్ చేయడమే గాక, ఏకంగా క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా పని చేసిన చిన్నారెడ్డి మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. సీనియర్ నేత, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కడి శివచరణ్ రెడ్డి తండ్రి, ఎల్బీనగర్ కాంగ్రెస్ నేత జక్కడి ప్రభాకర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేసింది. యాదగిరిగుట్ట ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్‌ను దూషించడంతో పాటు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ యాదవ సంఘాలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. వారి ఆందోళనలకు స్పందించిన టీపీసీసీ ఈ వ్యవహారంపై నివేదిక సమర్పించాలని రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని ఆదేశించింది. పార్టీ ఆదేశాల మేరకు నర్సింహారెడ్డి సీల్డ్‌కవర్‌లో టీపీసీసీకి నివేదిక ఇచ్చారు. నివేదికలో ఈశ్వరమ్మపై చేసిన ఆరోపణలు రుజువుకావడంతో ప్రభాకర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేస్తూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తి ఎమ్మెల్యే మెఘారెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై చిన్నారెడ్డికి నోటీసులు ఇచ్చింది. గతంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడిగా పని చేసిన చిన్నారెడ్డి ఇప్పుడు అదే కమిటీ వద్ద వివరణ ఇవ్వాల్సి రావడం విశేషం. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని చిన్నారెడ్డిని కమిటీ కోరింది.

ఆ వైద్యశాలకు ఏమైంది?

● ఆయుర్వేద వైద్యశాలకు పెరగని ఇన్ పేషెంట్లు ● 3 నెలలుగా నిలిచిన వైద్య సేవలు ● పూర్తి స్థాయి సిబ్బంది లేక చేతులు ఎత్తేస్తున్న వైద్యులు

● పట్టించుకోని ఆయుష్ ఉన్నతాధికారులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆయుర్వేద వైద్యంలో తెలంగాణ కు తలమానికంగా నిలుస్తున్న ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు సుస్తీ చేసింది. ఈ ఆసుపత్రిలో రోజూ అవుట్ పేషెంట్లు 400 నుంచి 900 వరకు వైద్య సేవలు పొందుతున్నారు. ఇన్ పేషెంట్లుగా 50 మంది నుంచి 60 మంది చేరుతుంటారు. 3 నెలలుగా ఇన్‌పేషెంట్లు రోజుకు 10 నుంచి 20 మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి ఆయుర్వేద వైద్యం కోసం వచ్చే రోగులకు ఇన్ పేషెంట్ సేవలు అందకపోవడంతో నరకయాతన పడుతున్నారు. జలమండలి ద్వారా సరఫరాను తగ్గించడంతో ఆయుర్వేద ఇన్ పేషెంట్లకు అందించే వైద్య సేవలను ఆసుపత్రి వైద్యులు నిలిపివేశారు. ఇదే విషయంపై ఆంధ్రప్రభ దినపత్రికలో జూన్ 2న ..ఆగిన ఆయుర్వేద వైద్య సేవలు.. అన్న శీర్షికన సమగ్ర వార్త కథనం ప్రచురించిన విషయం విదితమే. ఈ కథనం పై స్పందించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా ఆయుర్వేద ఆసుపత్రిలో నీటి సమస్యను గుర్తించి మంచినీటి బోరుకు అవసరమైన నిధులను మంజూరు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు బోరు వేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. సమస్య పరిష్కారమై నప్పటికీ ఇన్ పేషెంట్లకు వైద్య సేవలను పునరుద్ధరిం చకపోవడంతో ఆయుర్వేద ఆసుపత్రికి వచ్చే రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

సమస్యకు కారణాలెన్నో...

ఆయుర్వేద వైద్యశాలలో మూడు నెలలుగా నిలిచిపోయిన ఇన్ పేషెంట్ల వైద్య సేవలను పునరుద్ధరిం చడంలో ఎన్నో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఆసుపత్రిలో గతంలో ఉన్న సిబ్బందితోనే అప్పటి వైద్య అధికారులు పూర్తిస్థాయి వైద్య సేవలను అందిస్తూ వస్తున్నారు. గతంలో పనిచేసిన సిబ్బంది ప్రస్తుతం పని చేస్తున్నారు. నీటి సమస్య తీరాక ఇన్ పేషంట్ల సేవలు పునరుద్ధరిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశ ఎదురయింది. గతంలో ఆసుపత్రి సూపర్డెంట్ గా పనిచేసిన అధికారిని తొలగించి కొత్త సూపర్డెంట్ ను ఆయుష్ ఉన్నతదికారులు నియమించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పీజీ అర్హత, అనుభవం లేని అధికారికి బాధ్యతలు ఇవ్వడం వల్ల సమస్యలు తలెత్తుతు న్నాయని రోగులు ఆరోపిస్తున్నారు. అవసరమైన సిబ్బంది లేకపోవడం కూడా సమస్యగా మారిందని ఆసుపత్రి వైద్యులు పేర్కొంటున్నారు. ఎర్రగడ్డ ఆయుర్వేద ఆసుపత్రిలో పీజీ అర్హత కలిగిన ముగ్గురు వైద్యులు ఉన్నప్పటికీ అర్హత లేని వైద్యునికి కీలకమైన సూపరిండెంట్ బాధ్యతలు అప్పగించడంపై సీనియర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై ఢిల్లీలోనే ఆయుష్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

సిబ్బంది లేకనే...

ఆయుర్వేద ఆసుపత్రిలో అవసరమైన సిబ్బంది లేక ఇన్ పేషెంట్లకు వైద్య సేవలు అందించలేక పోతున్నామని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి సూపర్డెంట్ రాందాస్ నాయక్ తెలిపారు.త్వరలోనే ఇన్ పేషెంట్ సేవలను పునరుద్ధరించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఆయన ఆంధ్రప్రభకు తెలిపారు.

హైడ్రా చెరువుల అభివృద్ధి భేష్

● హైడ్రాకు జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ కితాబు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ నగరంలో హైడ్రా చేపట్టిన చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి చాలా బాగుందని జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ కితాబిచ్చింది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి చెరువులోకి వరద నీరు చేరేలా ఇన్‌లెట్లు, చెరువు నిండిన తర్వాత కిందకు పోయేలా ఔట్‌లెట్ల అభివృద్ధితో పాటు పటిష్టమైన బండ్‌ల నిర్మాణం ఇలా చెరువుకు ఉండే సహజలక్షణాలను పరిరక్షిస్తూ సాగుతున్న హైడ్రా చెరువుల అభివృద్ధి దేశానికి నమూనా అని కొనియాడింది. న్యూఢిల్లీకి చెందిన జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ ఛైర్మెన్ డాక్టర్ శైలేష్ కుమార్ శ్రీవాస్తవ నేతృత్వంలోని సభ్యులు నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి ఫాక్స్ సాగర్ సరస్సును బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సరస్సు ప్రధాన కట్ట (మెయిన్ బండ్)ను పరిశీలించి, సరస్సు ప్రస్తుత పరిస్థితి, కట్ట భద్రతకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. ఫాక్స్ సాగర్ సరస్సు ఎఫ్ టి ఎల్ పరిధి 482.6 ఎకరాలు కాగా, సరస్సు పరిరక్షణ, పునరుద్ధరణకు సంబంధించి హైడ్రా రూపొందిం చిన ప్రణాళికను వివిమోస్ టెక్నోక్రాట్స్ డైరెక్టర్ యూనస్ వెల్లడించారు. సరస్సు సరిహద్దుల పరిరక్షణ, ప్రజా ఆస్తుల రక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ అభివృద్ధి చర్యలపై వారికి వివరించారు. హైడ్రా ఫేజ్-3లో పెద్ద సరస్సుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఫాక్స్ సాగర్ సరస్సును అభివృద్ధి చేస్తున్నామన్నారు. చెరువు పునరుద్ధరణ, సంరక్షణ, నీటినిల్వ సామర్థ్యాన్ని కాపాడటం, సరస్సు పరిసరాలను పరిరక్షించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజా ఆస్తుల పరిరక్షణతో పాటు చెరువులు, సరస్సుల పునరుద్ధరణకు హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ సభ్యులు అభినందించారు.

సవాళ్లకు అనుగుణంగా మార్పులు

● ట్రాఫిక్, రోడ్డు భద్రతకు అధిక ప్రాధాన్యం ● గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ బదిలీలు

● 513 మంది అధికారులకు కొత్త బాధ్యతలు ● డ్రగ్స్, సైబర్ నేరాల, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై ప్రత్యేక దృష్టి: డీజీపీ సీ.వీ ఆనంద్



హైదరాబాద్,ఆంధ్రప్రభ క్రైంబ్యూరో: మారుతున్న నేరస్వభావం, ప్రజా భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లకు అనుగుణంగా రాష్ట్రపోలీసు శాఖలో మానవ వనరులను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు డీజీపీ సీ.వీ.ఆనంద్ స్పష్టం చేశారు. డీజీపీ కార్యాలయంలో బుధవారం ఆక్టోపస్, సీఐడీ, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం ప్రధాన సవాళ్లుగా ఉండేవనీ, ఇప్పుడు డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత, ఆహార కల్తీ వంటి అంశాలు కొత్త సవాళ్లుగా మారాయని వివరించారు. నేరాల కట్టడికి గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ తదితర ప్రత్యేక విభాగాల నుంచి 513 మంది సిబ్బందిని ఎనిమిది విభాగాలకు అవసరాలకు అనుగుణంగా కేటాయించామన్నారు. వీరిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు, 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లు ఉన్నారన్నారు. వీరిలో అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించామని చెప్పారు. ఆహార కల్తీ, డ్రగ్ కంట్రోల్‌కు 80 మంది, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు 79, సివిల్ సప్లయిస్‌కు 28, డీజీపీ ఆఫీస్ టి-స్పార్క్‌కు 27 మంది, ఏసీబీ, సీఐడీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు 25 మంది చొప్పున కేటాయించామన్నారు.

మత్తుపై మరో యుద్ధం

రాష్ట్రంలో యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని, గతేడాది 835 మంది విద్యార్థుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు గుర్తించినట్లు డీజీపీ తెలిపారు. మరో విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అధ్యయనంలో సుమారు 70 శాతం మంది విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసైనట్లు తేలిందని, డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా అడ్డుకోవడంతో పాటు విద్యార్థులు, తల్లిదం డ్రులు, విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమా లు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరాలు మరో ప్రధాన సవాలుగా మారాయని, ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, నకిలీ యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతున్నాయన్నారు. గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల కారణంగా సుమారు రూ.1,750 కోట్ల ఆర్థిక నష్టం జరిగినట్లు తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రూ. 40.96 కోట్ల ధాన్యం మాయం

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌పై కేసు నమోదు



ఉమ్మడి ఆదిలాబాద్, ఆంధ్రప్రభబ్యూరో : రైస్ మిల్లుల్లో ప్రభుత్వ ధాన్యం దారి మళ్లింపు, అక్రమాలపై నిందితుల మెడకు ఉచ్చు బిగిస్తోంది. రాష్ట్రప్రభుత్వం అక్రమార్కుల భరతం పట్టేందుకు కఠినంగా వ్యవహరిస్తూ పీడీ కేసులకు కూడా వెనుకాడటం లేదు. ఈనేపథ్యంలో నిర్మల్ జిల్లాఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకురాలు అజ్మీర రేఖానాయక్‌పై కేసు నమోదు చేసింది. రేఖానాయక్ పేరిట ఉన్న రైస్ మిల్లులో రూ.40.96 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం మాయమైన ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్‌గా విచారణ జరిపి ఆమెపై కేసు నమోదు చేశారు. ఖానాపూర్‌మండలం సత్తెనపల్లిలోని ఓ రైస్ మిల్లులో భారీ ఎత్తున ప్రభుత్వ ధాన్యం మాయమైనట్లు దర్యాప్తులో వెలుగులోకి రాగా రూ. 40.96 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం కుంభకోణంపై ఖానాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రబీసీజన్‌లకు సంబంధించి మొత్తం 9,639.962 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం క్షేత్రస్థాయిలో కనిపించకపోవడంతో నోటీసులు జారీ చేసి ధాన్యం విలువ సుమారు రూ. 40.96 కోట్లుగా అధికారులు నిర్ధారించారు. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్‌కు సంబంధించి 2022 నుంచి 2025 రబీసీజన్ వరకు కస్టం మిల్లింగ్‌కోసం ప్రభుత్వం ధాన్యం కేటాయించింది. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మిల్లింగ్‌చేసిన సీఎంఆర్ ప్రభుత్వానికి అప్పజెప్పాల్సి ఉండగా ఇంతవరకు అప్పగించకపోవడంపై ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ జరిపించారు. ఈ క్రమంలోనే ఈ నెల 18న ఖానాపూర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్ మిల్లులోని రికార్డులు, స్టాక్ వివరాలు, గోదాంలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో రికార్డుల ప్రకారం ఉండాల్సిన ప్రభుత్వ ధాన్యం, రేఖానా యక్ అందజేయాల్సిన సీఎంఆర్ భారీగా కొరత ఉన్నట్లు గుర్తించారు. ఇందులో భాగంగానే 2022-23లో 6,821. 640 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 4,638.715 మెట్రిక్ టన్నులకు 831.071 మెట్రిక్‌టన్నులు సీఎంఆర్‌మాత్రమే అందజేశారు. 116.541 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించారు. మొత్తానికి 5,482.936 మెట్రిక్ టన్నుల ధాన్యం అందుబాటులో ఉండాల్సి ఉండగా అధికారుల తనిఖీల్లో భాగంగా మిల్లులో ధాన్యం బియ్యం ఏమి కనిపించకపోవడాన్ని గుర్తించారు. 2023-24లో 7,430.840 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 5,052.971 మెట్రిక్ టన్నులకు ఇప్పటివరకు 3,205.259 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందజేశారు. 2,717.209మెట్రిక్ టన్నుల ధాన్యం అందుబాటులో ఉండాల్సి ఉండగా బియ్యం కనిపించలేదు. 2024-25 సంవత్సరంలో 1,908.934 అందుబాటులో ఉండాల్సి ఉండగా ఎన్‌ఫోర్స్ మెంట్ తనిఖీల్లో 469.117 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కనిపించింది. మూడు రబీసీజన్‌లకు సంబంధించి ఈ రైస్ మిల్లులో 9,639.962 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం కొరత ఉన్నట్లు ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు గుర్తించారు. దీనిధర రూ. 40.96 లక్షలుగా అంచనా వేసి అవకతవకలు జరిగినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పిర్యాదు మేరకు ఖానాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈఫిర్యాదు ఆధారంగా క్రైం నెంబర్ 165/2026 కింద ఖానాపూర్ పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే రేఖాశ్యాం నాయక్‌పై ధాన్యం అవకతవకలపై కేసు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

వారిని అన్‌ఫిట్ చేయాల్సిందే

● కూనంనేని ద్వంద్వ వైఖరి గర్హనీయం

● టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న 2 వేల మంది కార్మికులను వెంటనే అన్‌ఫిట్ చేసి, వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మికుల దరఖాస్తులు పరిష్కారమయ్యే వరకు ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలని, అప్పటి వరకు తమ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. అలియాస్ పేర్ల సమస్యపై కార్మికులను మోసం చేస్తున్న కూనంనేని సాంబశివరావు ద్వంద్వ వైఖరిని కార్మికులు గమనిస్తున్నారని ఆమె చెప్పారు. మరోవైపు, ప్రతి పల్లెకు సామాజిక న్యాయ తెలంగాణ సంకల్పాన్ని తీసుకెళ్లాలని కవిత పిలుపునిచ్చారు. పార్టీ ప్రధాన ఎజెండా అయిన పాంచజన్య పథకాలను ప్రతి గడపకూ చేరవేయాలన్నారు. భౌగోళిక తెలంగాణ సాధించుకున్నట్లే, సబ్బండ వర్గాల అభివృద్ధి కోసం మరో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, రాష్ట్రంలో ఆందోళన బాట పట్టిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఆమె సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తక్షణమే పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్ డీఏలు, బిల్లులను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పునరుత్పాదక విద్యుత్‌లో సింగరేణి కృషి

సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర దేశ ఇంధన భద్రతకు సింగరేణి సంస్థ తగినంత బొగ్గును అందించడంతో పాటు పునరుత్పాతక విద్యుత్తు రంగంలో కూడా తన వంతు కృషి చేస్తుందని సింగరేణి సంస్థ చైర్మన్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్ పో కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన భారత ఇంధన భద్రత విద్యుత్ ఉత్పత్తి అనే గోష్టిలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ దశాబ్దాల కాలంగా దేశ ఇంధన అవసరాలకు తనవంతుగా బొగ్గు అందిస్తూ వస్తుందని ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడానికి రాష్ట్ర జెన్ కో , ట్రాన్స్ కో కలిసి సమష్టిగా కృషి చేస్తుందన్నారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్, క్రిటికల్ మినరల్ రంగంలోకి కూడా ప్రవేశించిందని అయినప్పటికీ దేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్తు